అనుమతులున్న ఇండ్లను కూలుస్తారా?

- అధికారం శాశ్వతం కాదు
- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఫైర్

హైదరాబాద్, అక్టోబర్ 2(నమస్తే తెలంగాణ): అన్ని అనుమతులతో ఇండ్లు కట్టుకొని ఏండ్ల తరబడి ఉన్న వారిని రోడ్ల మీద వేయటంతో కాంగ్రెస్ ప్రభుత్వం సాధించిందేమిటి? అని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రశ్నించారు. విపక్షంలో ఉన్నప్పుడు రేవంత్‌రెడ్డి మాట్లాడిన దానికి, అధికారంలోకి వచ్చిన తర్వాత చేస్తున్న దానికి పొంతన లేకుండా పోయిందని ఆయన దుయ్యబట్టారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదనే విషయాన్ని కాంగ్రెస్ గుర్తుంచుకోవాలని హితవు పలికారు. ఇచ్చిన హామీలను గాలికొదిలి హైదరాబాద్‌లో భయానకమైన వాతావరణాన్ని సృష్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. కూల్చివేతల భయంతో గంధ శ్రీకుమార్ (55)అనే వ్యక్తి గుండెపోటుతో మరణించారని, అది గుండెపోటు మరణం కాదని, సర్కారు చేసిన హత్యగా కొప్పుల ఈశ్వర్ అభివర్ణించారు. కాంగ్రెస్ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలు ప్రజల ప్రాణాలను తీస్తున్నాయని మండిపడ్డారు.

మున్సిపల్ కమిషనర్‌కు ముందస్తు బెయిల్

హైడ్రా ఫిర్యాదు కేసులో హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు

హైదరాబాద్, అక్టోబర్ 2(నమస్తే తెలంగాణ): ఎర్రకుంట బఫర్‌జోన్‌లోని ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేసి, వాటిని ప్రోత్సహించారంటూ హైడ్రా చేసిన ఫిర్యాదు మేరకు సైబరాబాద్ పోలీసులు నమోదు చేసిన కేసులో నిజాంపేట మున్సిపల్ కమిషనర్‌కు హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ నిజాంపేట మున్సిపల్ కమిషనర్ పీ రామకృష్ణారావు దాఖలు చేసిన వ్యాజ్యాన్ని జస్టిస్ జువ్వాడి శ్రీదేవి బుధవారం విచారించారు. బెయిల్ మంజూరు చేసిన కోర్టు.. రెండు వారాల్లో పోలీసుల ముందు లొంగిపోవాలని ఆదేశించింది. రూ.20వేల వ్యక్తిగత పూచీకత్తుతోపాటు అంతే మొత్తానికి మరో రెండు పూచీకత్తులు తీసుకొని విడుదల చేయాలని పోలీసులకు సూచించింది. ప్రతి శనివారం ఉదయం 11 నుంచి సాయంత్రం 4గంటల మధ్య 8 వారాలపాటు పీఎస్‌లో హాజరు కావాలని స్పష్టంచేసింది.

కలల సౌధం చెదిరి.. మొండి గోడలు మిగిలి..

- అల్లాహ్.. కైసే జీనా?

శంకర్‌నగర్ బస్తీలో తమ ఇండ్లను కూల్చివేయడంతో సమీపంలోని మసీదు వద్ద ప్రార్థనలు చేస్తున్న మహిళలు

- నిర్విఘ్నంగా కూల్చివేతలు..

చాదర్‌ఘాట్ మూసానగర్‌లో కొనసాగుతున్న ఇండ్ల కూల్చివేత

- గూడు చెదిరె..

శంకర్‌నగర్ బస్తీలో కూల్చివేసిన ఇండ్లు

ఆశల సౌధాలను కండ్లముందే కూల్చివేస్తుండడంతో బాధితులు కన్నీరుమున్నీరవుతున్నారు. చాదర్‌ఘాట్ మూసానగర్, శంకర్‌నగర్ బస్తీలో బుధవారం హృదయవిదారకమైన దృశ్యాలు కనిపించాయి. పిల్లాపాపలతో ఇన్నాళ్లు జీవించిన ఇండ్లన్నీ మొండి గోడలుగా దర్శనమిచ్చాయి. చివరిసారిగా తమ ఇండ్లను చూసుకుంటూ గత స్మృతులను మననం చేసుకుంటూ కనిపించారు. ఇండ్లు కోల్పోవడంతో సమీప బంధువులను వీడి ఇతర ప్రాంతాలకు వెళ్తుండటాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. ఒకరినొకరు పలుకరించుకుంటూ బాధను దిగమింగుకొని వెళ్లారు. కొత్తగా వచ్చిన ప్రభుత్వం తమ గూడును చెదరగొట్టిందని ఆవేదన వ్యక్తంచేశారు. తమను ఇంతలా బాధపెడుతున్న సర్కారుకు తగిన బుద్ధి చెబుతామంటూ శాపనార్థాలు పెడుతూ వెళ్తుండడం కనిపించింది.

- నేనిక్కడే ఆడుకునేది..

చాదర్‌ఘాట్ మూసానగర్‌లో కూల్చివేతలో భాగంగా కోల్పోయిన ఇంటి వద్ద నిరాశగా బాలుడు

- ఎట్ల బతుకుదాం.. ఎక్కడికి పోదాం..

చాదర్‌ఘాట్ శంకర్‌నగర్ బస్తీలో కూల్చివేతల అనంతరం చివరిసారిగా తమ ఇంటి వద్ద కూర్చున్న ఓ కుటుంబం

అమీన్‌పూర్‌లో బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సాంబశివరావు

హైడ్రా.. పేదల ఇండ్ల జోలికి రావద్దు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

హైదరాబాద్/అమీన్‌పూర్, అక్టోబర్ 2 (నమస్తే తెలంగాణ): హైడ్రా పేదల ఇండ్ల జోలికి రావద్దని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు కోరారు. ఫామ్‌హౌస్‌లు, విల్లాలు కట్టుకున్న పెద్దల అక్రమ కట్టడాలు కూల్చడాన్ని ఏమీ తప్పు పట్టడం లేదని చెప్పారు. సంగారెడ్డి జిల్లా అమీన్‌పుర, పటేల్‌గూడ, బీఎస్సార్ కాలనీలో హైడ్రా కూల్చివేసిన పేదల ఇండ్లను బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జీతభత్యాల నుంచి నెలనెలా పోగుచేసిన డబ్బుతో బిల్డర్ల వద్ద కొనుగోలు చేసిన ఇండ్లను కూల్చడం అన్యాయమని పేర్కొన్నారు. దాదాపు 26 ఏండ్ల నుంచి ఉన్న ఇండ్లను కూల్చారని, వాటిలో ఇటీవలే గృహప్రవేశం చేసిన ఇండ్లు కూడా ఉన్నాయని తెలిపారు. గత 40 ఏండ్ల నుంచి ఈ భూముల క్రయ విక్రయాలు జరుగుతున్నాయని, వాటి ఈసీలు కూడా ఇప్పటికీ రిజిస్ట్రార్ ఆఫీసుల్లో ఉన్నాయని పేర్కొన్నారు. ఒకవేళ ఈ ఇండ్లు ప్రభుత్వ భూమిలో నిర్మించి ఉంటే 58, 59 జీవోల ద్వారా నివాసితులకు క్రమబద్ధీకరించవచ్చని సూచించారు. ఆ ఇండ్లు చెరువు ఎఫ్‌టీఎల్,, బఫర్ జోన్లలో లేవని తెలిపారు. తప్పుడు సర్వే నంబర్ల సమాచారంతో కూల్చివేతలు చేపడితే ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించి, నిర్వాసితులకు పూర్తిగా ఇండ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్ బాలమల్లేశ్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఈటీ నరసింహ, సంగారెడ్డి జిల్లా కార్యదర్శి జల్లా లుద్దీన్, రాష్ట్ర సమితి సభ్యుడు వీ ప్రకాశ్ రావు పాల్గొన్నారు.



కొడుకుకు పదవి కోసం మైనంపల్లి తంటాలు

- గజ్వేల్‌కు వచ్చి హైడ్రా, మూసీ గురించి ఎందుకు?
- బీఆర్ఎస్ నేత వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆగ్రహం

హైదరాబాద్, అక్టోబర్ 2 (నమస్తే తెలంగాణ): కొడుక్కి మంత్రి పదవి ఇప్పించడానికి, తనకు ఎమ్మెల్సీ పదవి తెచ్చుకోవడానికి కాంగ్రెస్ నేత మైనంపల్లి హనుమంతరావు అనేక తంటాలు పడుతున్నారని బీఆర్ఎస్ నేత వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆరోపించారు. కేసీఆర్‌ను తిడితే తన కొడుక్కి మంత్రి పదవి వస్తుందని అనుకుంటున్నారని విమర్శించారు. రేవంత్‌రెడ్డి మెప్పు కోసం కేసీఆర్ కుటుంబాన్ని మైనంపల్లి టార్గెట్ చేశారని అన్నారు. మైనంపల్లి మొన్న గజ్వేల్‌కు వచ్చి హైడ్రా, మూసీ గురించి ఎందుకు మాట్లాడారని, గజ్వేల్ ప్రజలకు హైడ్రాతో సంబంధం ఏమిటని నిలదీశారు. కాళేశ్వరం ప్రాజెక్టు గురించి అసలు ఆయనకు అవగాహనే లేదని మండిపడ్డారు. ఇప్పటికైనా పిచ్చి ప్రేలాపనలు మానుకుంటే మంచిదని మైనంపల్లికి హితవుపలికారు. తెలంగాణభవన్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టుతో 12 జిల్లాలకు మేలు కలుగుతున్నదని, మూసీ సుందరీకరణతో ఎంతమందికి మేలు జరుగుతున్నదో మైనంపల్లి చెప్పాలని డిమాండ్ చేశారు. మూసీని రూ.1.50 లక్షల కోట్లు పెట్టి సుందరీకరణ చేస్తే ఎంతమందికి ఉపాధి దొరుకుతుంది? అని ప్రశ్నించారు. లక్ష 50 వేల కోట్లు అంటే ఎన్ని వేల కోట్ల అవినీతి జరుగుతుందో అర్థం చేసుకోవచ్చని పేర్కొన్నారు. మల్లన్నసాగర్ బాధితులను అన్ని రకాలుగా ఆదుకున్నామని, ఆర్ అండ్ ఆర్ కాలనీలు నిర్మించి ఇచ్చామని చెప్పారు. మరి మూసీ బాధితులకు ఎలాంటి సహాయం చేస్తున్నారో చెప్పాలని నిలదీశారు. పేద ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారని, బాధితుల తరపున బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని హెచ్చరించారు.

కాంగ్రెస్ పార్టీని ప్రజలు క్షమించరు!

- కేసీఆర్ పాలనలో సుభిక్షంగా నగర ప్రజలు
- కాంగ్రెస్ పాలనలో భిక్షమెత్తుకోవాల్సిన ఖర్మ
- జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్
- బతుకమ్మ వేడుకల్లో హైడ్రా బాధితుల నిరసన

ఫిలింనగర్ లోతట్టు ప్రాంతంలోని షేక్‌పేట్ చెరువు వద్ద బతుకమ్మ వేడుకల్లో నిరసన తెలుపుతున్న హైడ్రా బాధితులు, చిత్రంలో ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

జూబ్లీహిల్స్, అక్టోబర్ 2: హైడ్రా పేరిట అక్కాచెల్లెండ్లు బతుకమ్మ వేడుకలను జరుపుకోకుండా చేసిన కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఎప్పటికీ క్షమించబోరని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ విమర్శించారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఫిలింనగర్ లోతట్టు ప్రాంతంలోని షేక్‌పేట్ చెరువు వద్ద బుధవారం బతుకమ్మ వేడుకల్లో మూసీ ప్రాజెక్ట్, హైడ్రా బాధితులు ప్లకార్డులతో పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేసీఆర్ పాలనలో సుభిక్షంగా ఉన్న నగర ప్రజలు.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక నేడు భిక్షమెత్తుకోవాల్సిన దుస్థితి నెలకొన్నదని ఆవేదన వ్యక్తంచేశారు. బీఆర్ఎస్ పాలనలో పేదలకు ప్రతి పథకం ఒక పండుగలా గడిచిందని.. నేడు బతుకమ్మ చీరలు లేకపోవడమే కాదు, బతుకేలేని శ్మశానంగా మారిందని మండిపడ్డారు. బతుకమ్మ పండుగను విశ్వవ్యాప్తం చేసిన ఘనత బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కే దక్కుతుందని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతి ఏటా బతుకమ్మ చీరలు పంపిణీ చేసేదని, కాంగ్రెస్ హయాంలో చేనేత కార్మికులకు కూడా అన్యాయం జరిగిందని విమర్శించారు. కేసీఆర్ పేదల మోములో చిరునవ్వు చూడాలని కోరుకునే వారని తెలిపారు. మళ్లీ ఆ చిరునవ్వులు విరబూసేందుకు పేదలకు, హైడ్రా బాధితులకు బీఆర్ఎస్ పార్టీ ఎళ్లవేళలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

పిడుగు పడి ముగ్గురి మృతి

- ఉమ్మడి వరంగల్‌లో గాలివాన బీభత్సం
- పలు గ్రామాల్లో విరిగిన విద్యుత్తు స్తంభాలు
- కూలిన చెట్లు.. ఎగిరిపోయిన ఇండ్ల పైకప్పులు
- చాలా ప్రాంతాల్లో నేలవాలిన వరి పంటలు

లక్ష్మి (ఫైల్)

నిర్మల (ఫైల్)

రమ (ఫైల్)

న్యూస్‌నెట్‌వర్క్, అక్టోబర్ 2: ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలు మండలాల్లో బుధవారం సాయంత్రం కురిసిన గాలివాన బీభత్సం సృష్టించింది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షానికి పిడుగులు పడి ముగ్గురు మహిళలు మృతి చెందారు. వేగంగా వీచిన గాలులకు విద్యుత్తు స్తంభాలు విరిగిపడ్డాయి. పలు చోట్ల చెట్లు కూలిపోయాయి. మరికొన్ని చోట్ల వరి తదితర పంటలు నేలవాలాయి. ములుగు మండలం మల్లంపల్లి ప్రభుత్వ పాఠశాలలో చెట్లుపై పిడుగుపడి చీలిపోయింది. మంగపేట మండలంలోని పలు గ్రామాల్లో పలువురి ఇండ్లపై రేకులు ఎగిరిపోయాయి. మండల కేంద్రంలోని శివాలయం సమీపంలో ఉన్న సుమారు 100 ఏండ్ల నాటి భారీ చింత చెట్టు నేలకూలింది.

హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం చౌళ్లపల్లికి చెందిన ఇటుకల నిర్మల (51), సోలెంక రమ (45)తోపాటు మరో ఎనిమిది మంది పత్తి తీయడానికి వెళ్లారు. ఉరుములు, మెరుపులతో వాన మొదలవ్వడంతో నిర్మల, రమ పక్కనే ఉన్న చెట్టు కింద నిలబడ్డారు. మిగతా వారు వేరే చోట ఉన్నారు. ఇదే సమయంలో చెట్టుపై పిడుగు పడి ఇద్దరు మహిళలు అక్కడికక్కడే మృతి చెందారు. నిర్మలకు ముగ్గురు కుమార్తెలు, భర్త రాజేందర్ ఉన్నారు. రమకు ఇద్దరు కుమారులు, భర్త మహేందర్ ఉన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం రంగయ్యపల్లెకు చెందిన కారట్లుపెల్లి లక్ష్మి (49) భర్త నగేశ్‌తో కలిసి వ్యవసాయ పొలం వద్దకు వెళ్లింది. పత్తి మొక్కలకు ఎరువులు వేస్తున్న సమయంలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. దీంతో ఇంటికి వచ్చేందుకు సిద్ధమవుతుండగా ఒక్కసారిగా పిడుగు పడి లక్ష్మి అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలికి భర్తతోపాటు ఇద్దరు కూతుళ్లు, కొడుకు ఉన్నారు. విషయం తెలుసుకున్న భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డితోపాటు ప్రస్తుత ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆమె కుటుంబాన్ని ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.

కౌలు రైతు ఆత్మహత్య

- కాలం కలిసి రాక.. అప్పులు భారమై
- నిర్మల్ జిల్లా తానూర్‌లో బలవన్మరణం

బాలాజీ (ఫైల్)

తానూర్, అక్టోబర్ 2 : కాలం కలిసి రాక.. అప్పులు భారమై ఓ కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన నిర్మల్ జిల్లా తానూర్ మండల కేంద్రంలో బుధవారం చోటుచేసుకున్నది. స్థానికుల కథనం ప్రకారం.. తానూర్‌కు చెందిన రైతు జాదవ్ బాలాజీ (35) 20 ఎకరాల భూమి ని కౌలుకు తీసుకున్నాడు. సోయా వేయగా పంట చేతికొచ్చే సమయంలో అధిక వర్షాలు పడ్డాయి. పంట నేలమట్టం కావడం, దిగుబడి రాదేమోనని బెంగ, తెచ్చిన రూ.12 లక్షల అప్పు ఎలా కట్టాలో తెలియక మనస్తాపానికి గురయ్యాడు. బుధవారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. బాలాజీకి కొడుకు, కూతురు ఉన్నారు. భార్య రూప ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై రమేశ్ తెలిపారు.

వాగులో కొట్టుకుపోయిన ఎడ్లబండి

- బండి మీద పడటంతో రైతు మృతి
- మహిళలను రక్షించిన స్థానికులు

గాంధీ (ఫైల్)

టేకులపల్లి, అక్టోబర్ 2: వ్యవసాయ పనులకు వెళ్లి తిరిగివస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు వాగులో ఎడ్లబండి కొట్టుకుపోగా రైతు మృతిచెందింది. ఈ ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలంలోని కొత్తతండా(పీ) గ్రామంలో బుధవారం చోటుచేసుకున్నది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు ఆంగోత్ గాంధీ (35) ఉదయం తన భార్యతో పాటు మరికొందరు మహిళలతో కలిసి ఎడ్లబండిపై లక్ష్మీపురం గ్రామం మీదుగా తన చేనుకు వెళ్లారు. సాయంత్రం ఇంటికి తిరిగి వస్తున్న క్రమంలో లక్ష్మీపురం సమీపాన ఉన్న గంగమ్మతల్లి వాగులో ఎడ్లబండి కొట్టుకుపోయింది. ఎగువన కురిసిన వర్షానికి వరద పెరగడంతో ఈ ప్రమాదం చోటుచేసుకున్నది. స్థానికులు వెంటనే మహిళలను రక్షించారు. ఎడ్లబండి మీదపడటంతో గాంధీ మృతిచెందాడు.